నేడు అంబేద్కర్ వర్సిటీ టెలీకాన్ఫరెన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం అకడమిక్, అభివృద్ధి కార్యకలాపాలపై గురువారం మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నట్టు విశ్వవిద్యాలయ ఈఎంఆర్ఆర్సి డైరెక్టర్ వడ్డాణం శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వవిద్యాలయ యూ ట్యూబ్ ఛానల్, (ఙఙ.ఎతీఖశీబ), టీ-శాట్ నిపుణ ద్వారా టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు, అధ్యయన కేంద్రాల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. టెలిఫోన్ నెంబర్ 040-23680456 ద్వారా సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి కె సీతారామరావు, అకడమిక్ డైరెక్టర్ జి పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ఎవిఆర్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొని అకడమిక్, విద్యాభివృద్ధి కార్యకలాపాలపై చర్చించి విద్యార్థుల సందేహాలకు సమాధానాలిస్తారని వెల్లడించారు. ఇక నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రతి గురువారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మరో రెండు రోజులు తేలికపాటి వర్షాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెండు రోజుల పాటు తెలంగాణలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. బుధవారం రంగారెడ్డి, నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మే 12న రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. మే 15 వరకు వాతావరణం కాస్త చల్లగానే ఉంటుందని, మే 20 తర్వాత గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

12 ఎంపి స్థానాలిస్తే మళ్లీ కెసిఆర్‌దే హవా..

- ఆరు నెలల్లో రాష్ట్రంలో పెను మార్పులు : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంటు ఎన్నికలలో రాష్ట్రంలో 12 ఎంపి స్థానాలలో బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే మళ్లీ కెసిఆర్‌దే హవా ఉంటుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. నాగర్‌కర్నూల్ ఎంపి అభ్యర్థి ఆర్ఎస్. ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా బుధవారం కల్వకుర్తి, అచ్చంపేటలో నిర్వహించిన రోడ్ షోల్లో కెటిఆర్ ప్రసంగించారు. ఆరు నెలల్లో రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించ బోతున్నాయని చెప్పారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ బడేబాయి, రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి చోటాబాయి మాదిరిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వంద రోజుల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కాలేదన్నారు. మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం ఇవ్వకున్నా హామీలన్నీ అమలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు మాట్లాడుతున్నారని చెప్పారు. పచ్చి అబద్ధాలు చెబుతున్న కాంగ్రెస్‌ను ఎన్నికల్లో ఓడించాలని కోరారు. జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తానని ఇప్పటికీ దిక్కులేదన్నారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్టుగా రేవంత్ రెడ్డి తారీకు మారుస్తారని, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతుబంధు అమలు కావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని నడపడమంటే పాను డబ్బా నడపడం కాదని ఎద్దేవా చేశారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత రేవంత్ రెడ్డి బీజేపీలోకి పోతాడని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్‌ను ఎంపిగా గెలిపిస్తే ఈ ప్రాంతానికి గౌరవం పెరుగుతుందని, అభివృద్ధిలో ముందుంటుందని అన్నారు. గురుకులాల కార్యదర్శిగా లక్షలాది మంది విద్యార్థులకు సేవ చేసిన వ్యక్తి ప్రవీణ్ కుమార్ అని, అచ్చంపేట ప్రాంతంలో చదువుకున్న వ్యక్తికి అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ నాయకులు ఎన్ని ప్రలోభాలు పెట్టినా లొంగకుండా తెలంగాణ సాధించిన కెసిఆర్ పక్కన నిలబడి మీ ముందుకు వచ్చాడన్నారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మోడీ పాలనలో దేశంలో 2 కోట్ల ఉద్యోగాలు రాలేదని, బిజెపికి మత విద్వేషం తప్ప, అభివృద్ధి పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు

రాజ్యాంగం రద్దుకు కుట్ర

- తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో బిజెపిని ఓడించాలి
- సిపిఎం జాతీయ నాయకులు సాయిబాబు

సభలో మాట్లాడుతున్న సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో రాజ్యాంగ సంస్థలనే ఆయుధాలుగా చేసుకుని రాజకీయాలు చేస్తున్నారని, రాజ్యాంగాన్ని రద్దు చేసేందుకు కుట్ర జరుగుతోందని సిపిఎం జాతీయ నాయకులు సాయిబాబు అన్నారు. భువనగిరి పార్లమెంట్ సిపిఎం ఎంపి అభ్యర్థి ఎండి జహంగీర్ గెలుపును కాంక్షిస్తూ యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి పట్టణ కేంద్రంలో బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రసాదం విష్ణు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ చైతన్యవంతమైన ప్రాంతమని, ఎర్రజెండా నాయకత్వంలో దొరల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటం జరిగిన గడ్డ అని అన్నారు. అదే స్ఫూర్తితో బిజెపిని గద్దెదించే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విద్య, వైద్య రంగాలను కార్పొరేట్‌లోకి వదలడంతో సామాన్యుడి బతుకు భారమైందన్నారు. దేశంలో బిజెపి అధికారంలోకొచ్చాక దళితులు, మహిళలు, మైనార్టీలపై దాడులు పెరిగాయన్నారు. కార్మిక వర్గంపై బిజెపి యుద్ధం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్ల పాలనలో లక్ష మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, స్వామినాథన్ సిఫారసులు అమలుపై అడుగు కూడా ముందుకు వేయలేదని అన్నారు. తెలంగాణలో నల్లమలపై కేంద్రం కన్ను పడిందని చెప్పారు. అటవీ హక్కుల ప్రకారం గిరిజనులకు హక్కుపత్రాలు ఇవ్వలేదన్నారు. మణిపూర్‌లో గిరిజన మహిళలపై దారుణ ఘటనలు జరిగినా ప్రధాని మోడీ స్పందించలేదని విమర్శించారు. దేశంలో అత్యంత అవినీతి పార్టీగా బిజెపి మారిందన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వాదులు, మేధావులు అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే మోడీ ప్రభుత్వం దేశద్రోహులుగా చూపుతూ వారిని జైళ్లలో పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ భవిష్యత్‌ను నిర్ణయించే బడ్జెట్ కేటాయింపులపైనా చర్చ లేదని, అలాంటి బీజేపీ నాయకులను గెలిపించడం అంటే ప్రజాస్వామ్యాన్ని చేతులారా నియంతలకు అప్పజెప్పడమేనన్నారు. మతోన్మాద బిజెపిని ఓడించి ప్రజా గొంతుక.. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పోచంపల్లి మండలానికి చెందిన సిపిఐ నాయకులు సిపిఎం ప్రజాసంఘాల్లో చేరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, వెంకటేష్, కూరపాటి రమేశ్, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి, నాయకులు పగిళ్ల లింగారెడ్డి, కోడే బాలనర్సింహ, కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, గూడూరు బుచ్చిరెడ్డి, ఎస్‌డబ్ల్యుఎఫ్, సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు కుంభం జనార్దన్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

వర్షాల వల్ల నష్టపోయినవారిని ఆదుకోవాలి

- చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- తడిసిన ధాన్యాన్ని కొర్రీల్లేకుండా కొనుగోలు చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన ప్రజలు, రైతులను ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ఈదురు గాలులు, వడగండ్ల వర్షాల వల్ల ఏడుగురు మరణించారని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరెంట్ స్తంభాలు, చెట్లు విరిగిపోవడంతో అనేక ఇండ్లకు నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. మార్కెట్లల్లో ధాన్యం తడిసి, బస్తాలు కొట్టుకుపోయాయని వివరించారు. యాసంగిలో కోతకొచ్చిన వరి పంట దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. జొన్న, వేరుశనగ, మొక్కజొన్న పంటలతోపాటు, కూరగాయలు, మామిడి తదితర పండ్లతోటలకు నష్టం కలిగిందని తెలిపారు. తక్షణమే నష్టపోయిన రైతులు, సామాన్య ప్రజలకు నష్టపరిహారం చెల్లించి అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఇంకా రెండు రోజులపాటు భారీ వర్షాలు పడతాయంటూ వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో మార్కెట్లలో తగు రక్షణచర్యలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గతేడాది డిసెంబర్ నాలుగు నుంచి ఏడు తేదీల్లో మిచౌంగ్ తుఫానువల్ల రాష్ట్రంలో రెండు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. 49 మంది మరణించారని పేర్కొన్నారు. మార్చి 18న వడగండ్ల వర్షాలకు 20 వేల ఎకరాల్లో నష్టం జరిగిందని తెలిపారు. 16 వేల మంది రైతులు నష్టపోయారని వివరించారు. నష్టపోయిన వారికి ఎలాంటి పరిహారం ఇవ్వలేదని పేర్కొన్నారు. దీన్నుండి రైతులు కోలుకోకముందే ప్రస్తుత ఆకస్మిక వర్షాల వల్ల మరింత నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చనిపోయినవారి కుటుంబాలకు రూ.ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు దెబ్బతిన్న ఇండ్లకు మరమ్మత్తుల కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. మార్కెట్లలో ధాన్యం కొట్టుకుపోయి నష్టపోయిన వారికి తగు పరిహారం చెల్లించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కొర్రీల్లేకుండా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లి, గంగాధర మండలంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యానికి సంబంధించిన తేమ శాతాన్ని పర్యవేక్షించారు. ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం కేంద్రానికి వచ్చింది, డబ్బులు రైతుల అకౌంట్‌లో జమ అయ్యాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని రైతులతోనూ మాట్లాడారు. ధాన్యం డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాలో జమ అవుతున్నాయా అని అక్కడికి వచ్చిన రైతులను అడిగి తెలుసుకున్నారు. మూడు, నాలుగు రోజుల్లోనే బ్యాంక్ ఖాతాలో జమవుతున్నాయని రైతులు కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన ప్రతి రైతుకు సంబంధించిన సెల్ నెంబర్‌ను రిజిస్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు.

భువనగిరిలో సిపిఎంను గెలిపించాలి

- మోడీ మళ్ల గెలిస్తే రాజ్యాంగానికి ప్రమాదం
- అందుకే బిజెపిని చిత్తుగా ఓడించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- ఇబ్రహీంపట్నంలో అభ్యర్థి జహంగీర్‌తో కలిసి రోడ్ షో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో మూడోసారి మోడీ గెలిస్తే భారత రాజ్యాంగానికి ప్రమాదమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో ఇక ఎన్నికలనేవే ఉండబోవని చెప్పారు. ప్రజాస్వామ్య మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని, అందుకే బిజెపిని చిత్తుగా ఓడించాలని తెలిపారు. భువనగిరిలో సిపిఎంను గెలిపించాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో అభ్యర్థి జహంగీర్‌తో కలిసి రోడ్డు షో నిర్వహించారు. ఉదయం ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లిలో ప్రారంభమైన బైక్ ర్యాలీ.. పోల్కంపల్లి, జాజోని బావులు, నెర్రపల్లి, దండుమైలారం, ముకునూరు, రాయపోలు గ్రామాల్లో ప్రచారం చేసింది. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో తమ్మినేని మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే మోడీ మళ్ళీ అధికారంలోకి రావొద్దన్నారు. కులమత తారతమ్యం లేకుండా జీవిస్తున్న లౌకిక రాజ్యాన్ని సమాధి చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. కార్పొరేట్ రాజ్యాన్ని తీసుకొచ్చి, మనువాద సిద్ధాంతాన్ని రాజ్యాంగంగా మార్చే ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. అందుకే దేశంలో బిజెపిని చిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బిజెపిని గద్దె దించాలన్న లక్ష్యంతోనే దేశంలోని 28 రాజకీయ పార్టీలు ఇండియా కూటమిగా ఏర్పడ్డాయని చెప్పారు. భువనగిరిలో తాము పోటీ చేస్తున్నామని, సుత్తి, కొడవలి, నక్షత్రం గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను కోరారు. మిగిలిన స్థానాల్లో బిజెపిని ఓడించేందుకు ఇండియా కూటమిలోని కాంగ్రెస్‌ను బలపరుస్తున్నామని చెప్పారు. బిసి నినాదం అందుకున్న బిజెపి గడిచిన పదేండ్లలో బిసి గణన ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. అన్ని రాజకీయ పార్టీలు బిసి గణన చేయాలని కోరుతున్నా ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన బిజెపి గడిచిన పదేండ్లలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను సైతం భర్తీ చేయలేదని తెలిపారు. ప్రయివేటు రంగాల్లో రిజర్వేషన్లు లేకుండా పోయాయన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేస్తోందని, దాంతో నిరుద్యోగం పెరిగిందన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన మోడీ ప్రభుత్వం గడిచిన సంవత్సర కాలంలో నాలుగు నల్ల చట్టాలు తీసుకువచ్చి 750 మంది రైతులను పొట్టన పెట్టుకుందని విమర్శించారు. 2022 వరకు అందరికీ ఇల్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆ ప్రయత్నం ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఎందుకు ఇంకా పేదలు ఇండ్ల స్థలాలు, ఇండ్ల కోసం కొట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాజ్యాంగ సంస్థలైన ఈడీ, సీబీఐ, ఐటీ వంటి సంస్థలను జేబు సంస్థలుగా మలుచుకొని ధ్వంసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రులపై సైతం కేసులు విధిస్తూ జైలుపాలు చేస్తున్నారని తెలిపారు. ఢిల్లీ, జార్ఖండ్ ముఖ్యమంత్రుల ఉదంతాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేవలం ప్రతిపక్ష పార్టీ ప్రతినిధులపైనే ఎందుకు దాడులు జరుగుతున్నాయని,బిజెపిలోని నాయకులపై ఎందుకు ఆ సంస్థలు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 2006లో వామపక్షాల ఉద్యమ ఫలితంగానే ఉపాధి హామీ చట్టం వచ్చిందని గుర్తు చేశారు. దాన్ని సైతం మోడీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందన్నారు. ఈ తరుణంలో మోడీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్‌వెస్లీ, జిల్లా కార్యదర్శి భాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు జయలక్ష్మి, వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, యాదయ్య, జగదీష్, కవిత, జిల్లా కమిటీ సభ్యులు జగన్, సీహెచ్ జంగయ్య, శ్యాంసుందర్, శ్రీనివాసరెడ్డి, అంజయ్య, ఏర్పుల నర్సింహ, దుబ్బాక రాంచందర్, ఆలంపల్లి నర్సింహ, ఆయా ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల సభలో మాట్లాడుతున్న ఎస్ వీరయ్య

ప్రజా వ్యతిరేక, మతోన్మాద బిజెపిని ఓడించాలి

- ఎలక్టోరల్ బాండ్ల పేరుతో అవినీతి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా వ్యతిరేక మతోన్మాద బిజెపిని ఓడించాలని,సిపిఎం బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. వీరయ్య పిలుపునిచ్చారు. బుధవారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా గ్రామంలో కొండ్రెడ్డి చెన్నారెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ ములుగు జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మతోన్మాద, కార్పొరేట్ విధానాలతో దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బిజెపిని ఓడించి లౌకిక శక్తులను పార్లమెంట్‌కు పంపాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ పదేండ్ల పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ కార్పొరేట్లకు దోచిపెట్టిందని అన్నారు. ఎలక్టోరల్ బాండ్ల పేరుతో బిజెపి పెద్ద అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. రూ.16 వేల కోట్లు వస్తే అందులో రూ.8262 కోట్లు కేవలం బిజెపి ఖాతాలో పడ్డాయని అన్నారు. కార్మికులకు ఫ్లోర్ లెవెల్ మినిమం వేజ్ రోజుకు 178 రూపాయలుగా బిజెపి నిర్ణయించడం దారుణం అన్నారు. ఇలాంటి బిజెపిని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి బలరాం నాయక్ మాట్లాడుతూ.. ఇండ్ల స్థలాలకు పట్టాలిచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. రైతులకు మద్దతు ధరతో పాటు సాగు నీరు అందిస్తామని అన్నారు. సిపిఎం నాయకుల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రత్నం రాజేందర్, బీరెడ్డి సాంబశివ, కాంగ్రెస్ పార్లమెంట్ సమన్వయ కర్త అనిల్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వారినే ఎన్నుకోండి

- సిపిఎం అభ్యర్థి జహంగీర్‌ను పార్లమెంట్‌కు పంపించండి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగయ్య, మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజా సమస్యలపై పోరాడుతూ.. వారి కోసం పనిచేసే నేతనే ఎన్నుకోవాలని, అలాంటి నాయకుడు సిపిఎం అభ్యర్థి ఎండి జహంగీర్‌ను ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సభ్యులు జి.నాగయ్య, మల్లు లక్ష్మి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఇంటింటికీ తిరిగి ఓటు ప్రాధాన్యత, జహంగీర్ గురించి వివరించారు. సిపిఎం అభ్యర్థి జహంగీర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నకిరేకల్ పట్టణంలోని 2, 3 వార్డులలో నాగయ్య ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. సమస్యలపై పోరాడలేని అసమర్థులకు ఓటు వేయొద్దని నాగయ్య అన్నారు. పోరాడే వారికి ఓటు అనే ఆయుధాన్ని ఇస్తే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల, చౌల్లతండా గ్రామాల్లో మల్లు లక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద మధ్య తరగతి ప్రజలపై అనేక భారాలు పడుతున్నా పార్లమెంట్‌లో ప్రశ్నించే వారి సంఖ్య తగ్గుతోందని, మెజార్టీ సభ్యులు పెట్టుబడిదారులు, కార్పొరేట్ల ప్రయోజనాల గురించి ఆలోచించేవారని చెప్పారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కొనసాగుతున్న మోడీ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందన్నారు.

తడిసి మొలకెత్తిన వేరుశనగ

- దళారులకు ధాన్యం అమ్మకాలు
- రైతును కుదేలు చేసిన అకాల వర్షం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వ్యయ ప్రయాసలకోర్చి ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందే తరుణంలో అకాల వర్షాలకు తడిసి ముద్దవడంతో రైతు పరిస్థితి ముందు గొయ్యి వెనుక నుయ్యిలా తయారైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో రబీ పంటగా వరి 1500 ఎకరాల్లో, వేరుశనగ 1000 ఎకరాల్లో సాగు చేశారు. వరి కోసి కల్లాల్లో ఉండగా, వేరుశనగను యంత్రాలతో వొన్ను చేసుకుంటున్నారు. మంగళవారం మధ్యాహ్నం అర్థగంట పాటు సంభవించిన గాలులతో కూడిన భారీ వర్షానికి కల్లాల్లో ఉన్న వరి ధాన్యం, పొలంలో ఉన్న వేరుశనగ పంట పూర్తిగా తడిచిపోయింది. దాంతో తడిచిన ధాన్యాన్ని రైతులు దళారులకు ఎంతోకొంతకు అమ్మకానికి పెట్టారు. తడిచిన వేరుశనగ పంటను తిరగేసి ఆర పెడుతున్నారు. వరి ధాన్యం కాంటాలు అయిన లోడింగ్ కాకపోవడంతో తడిసింది.

అకాల వానలతో అపార నష్టం : సత్తెనపల్లి వెంకటేశ్వరరావు, రైతు

ఎనిమిది ఎకరాల్లో వేరుశనగ వేశాను. ఎకరానికి కౌలుతో సహా రూ.80 వేలు పెట్టుబడితో సుమారు రూ.7 లక్షలు వ్యయమయింది. గత మూడు రోజులుగా వేరుశనగ తీసి యంత్రం ద్వారా పంటను వేరు చేస్తున్నాం. మంగళవారం వచ్చిన అకాల వానలకు తడిసి మొలకెత్తే పరిస్థితి ఏర్పడింది. అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు గానీ రైతులు వైపు కన్నెత్తి చూసే పరిస్థితి లేదు.

మత్తుపై అబ్కారి శాఖ కొరడా

- నాలుగు నెలల్లో రూ.7 కోట్ల గంజాయి, హెరాయిన్ పట్టివేత
- 47 వేల లీటర్ల గుడుంబా ధ్వంసం
- రూ.61 లక్షల మద్యం పట్టివేత
- 9,843 కేసులు నమోదు, 553 మంది పై బైండోవర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో మత్తు పదార్థాలు, గుడుంబా, నకిలీ మద్యంపె అబ్కారి శాఖ కొరఢా ఝుళిపించింది. గంజాయి, హెరాయిన్, చరాస్, తదితర మత్తు పదార్థాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రత్యేక దృష్టి పెట్టింది. నాటు సారా తయారీని అరికట్టేందుకు జిల్లాల వారీగా స్పెషల్ డ్రైవ్‌లను చేపట్టింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రభావితం చేసేందుకు ఇతర రాష్ట్రాలనుంచి వచ్చే నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం రవాణా, అమ్మకాలపై కఠిన చర్యలకు ఉపక్రమించింది. గత నాలుగు నెలల కాలంలో రాష్ట్రంలో పెద్ద మొత్తంలో మత్తు పదార్థాలను అబ్కారి శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పట్టుకుంది 33 జిల్లాల్లో 350 మందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తున్నాయి. ఆయా టీంలు ఇప్పటి వరకు రూ.7.20,92,740 విలువ చేసే మత్తు పదార్థాలను సీజ్ చేసి, 396 మందిపై కేసులు నమోదు చేశాయి. అలాగే 553 మందిని ముందస్తుగా బైండోవర్ చేశారు. 2,283.764 కేజీల గంజాయి, 1.25 కేజీల హాషీష్, 30.33 గ్రాముల ఎండీఎంఏ, 80 గ్రాముల హెరాయిన్, 117.2 గ్రాముల చరాస్, 1,56,565 గ్రాముల పప్పిస్ట్రాను పట్టుకున్నారు. వీటిని అక్రమంగా తరలిస్తున్న 133 వాహనాలను సీజ్ చేశారు. నాటు సారా తయారీ కేంద్రాలు, అక్రమ రవాణాపై దాడులు నిర్వహించి 47,640 లీటర్ల గుడుంబాను సీజ్ చేశారు. 9,145 కేసు నమోదు చేసి, 4,010మందిని నిందితులుగా చేర్చారు. 2,48,094 కిలోల నల్ల బెల్లాన్ని, 29,04,094 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. 14,302 కేజీల అలంను పట్టుకున్నారు. వీటి రవాణాకు ఉపయోగించిన 593 వాహనాలను సీజ్ చేసి, రూ.39,15,35, 990 విలువ కలిగిన గుడుంబా తయారికి వాడే సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం పై 302 కేసులు నమోదు చేసి 165 మందిని అరెస్ట్ చేశారు. రూ. 61,13,000 విలువ కలిగిన 3,740 లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కల్తీ కల్లు తయారీపై దాడులు నిర్వహించి 565.6 కేజీల క్లోరల్ హైడ్రేటును సీజ్ చేశారు. 7,41,281 లీటర్ల కల్లును ధ్వంసం చేశారు. 5.463 కేజీల అల్ప్రోజోలమ్‌ను స్వాధీనం చేసుకున్నారు.వీటి విలువ దాదాపు రూ. 47.83 కోట్లుటుందని ఆబ్కారి శాఖ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో డ్రగ్ అనే పదం వినపడకూడదనే సీఎం ఆదేశాల మేరకు అబ్కారి శాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది.

మత్తు పదార్థాలపై కఠిన చర్యలు
కమలాసన్ రెడ్డి, అబ్కారి శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్

రాష్ట్రంలో మత్తు పదార్థాల అక్రమ రవాణా, అమ్మకంపై కఠిన చర్యలు చేపట్టాం. రాష్ట్ర వ్యాప్తంగా 350 మందితో ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తున్నాయి. గత నాలుగు నెలల కాలంలో గతంలో ఎన్నడు లేని విధంగా పెద్ద మొత్తంలో గంజాయి, హెరాయిన్, ఇతర మత్తు పదార్థాలు,నాటుసారా, అక్రమ మద్యాన్ని పట్టుకున్నాం. ఈ నిఘా నిరంతరం కొనసాగుతుంది. విద్యార్థులు, యువకులు మత్తు బారిన పడకుండా వారికి అవగాహన కల్పిస్తున్నాం.

నేటి నుంచి ఇంటర్ ప్రవేశాలు

- జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం
- తొలివిడత అడ్మిషన్లకు తుది గడువు 30
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా బుధవారం విడుదల చేశారు. గురువారం నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమవు తుందని తెలిపారు. రాష్ట్రం లోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కెజిబివిలు, గురుకుల జూనియర్ కళాశాల ల్లో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులస్వీకరణ ప్రక్రియ గురువారం నుంచి ప్రేర్కొన్నారు. మొదటి విడత ప్రవేశాల ప్రక్రియకు తుది గడువు జూన్ 30వ తేదీ వరకు ఉందని వివరించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు పారంభస్తుంది. తెలిపారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకూ అదేరోజు నుంచి తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు.రెండో విడత పారంభమవుతాయ ని ప్రవేశాల ప్రక్రియ తేదీలను తర్వాత ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఇంటర్‌నెట్ మార్కుల మెమోతో ఇంటర్‌లో ప్రవేశం పారంభమవుతాయని పొందొచ్చని సూచించారు. కాలేజీలో చేరిన తర్వాత ఎస్ఎస్‌సి ఒరిజినల్ మెమో, టీసీ ఇవ్వాలని కోరారు. ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు పది శాతం, బిసిలకు 29 శాతం (ఎ-7,బి-10,సి-1, డి-7, ఇ-4), వికలాంగులకు మూడు శాతం, ఎన్‌సిసి, క్రీడాకారులకు, ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ వారికి ఐదు శాతం, ఎక్స్ సర్వీస్‌మెన్, రక్షణ శాఖలో పనిచేసిన వారి పిల్లలకు మూడు శాతం, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఈడబ్ల్యూఎస్)కు పది శాతం చొప్పున ఇంటర్ ప్రవేశాల్లో రిజర్వేషన్లుంటాయని వివరించారు. అన్ని కేటగిరీల్లోనూ అమ్మాయిలకు 33 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థుల ఆధార్ నెంబర్ తప్పనిసరి అని తెలిపారు. పదో తరగతిలో గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జిపిఎ) ఆధారంగా అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టాలనీ, ఎలాంటి పరీక్షను నిర్వహించొద్దని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంజూరైన సెక్షన్లలోనే విద్యార్థులను చేర్చుకోవాలనీ, ఒక్కో సెక్షన్‌లో 88 మంది వరకే ప్రవేశాలకు అనుమతి ఉందని ప్రయివేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలను కోరారు. అదనపు సెక్షన్లకు ఇంటర్ బోర్డు అనుమతి ఇచ్చిన తర్వాతే వాటిలో ప్రవేశాలు చేపట్టాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామనీ, జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కాలేజీల ప్రవేశం వద్ద మంజూరైన సెక్షన్లు, సీట్ల వివరాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజువారీగా ప్రవేశాల ప్రక్రియ, చేరిన వారితోపాటు ఖాళీల వివరాలను ప్రకటించాలని కోరారు. జోగినీల విద్యార్థులుంటే వారి తండ్రి పేరు బదులుగా తల్లిపేరును పరిగణనలోకి తీసుకోవాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. అమ్మాయిలకు రక్షణ కల్పించాలని కోరారు. అనుబంధ గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల్లోనే ప్రవేశం పొందాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించారు. ఆ కాలేజీలజాబితాను acadtsbie.cgg.gov.in లేదా tsbie.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని వివరించారు.

పోటాపోటీగా ప్రచారం

- గెలుపుపై ఎవరి ధీమా వారిదే...
- 13న పోలింగ్‌కు సర్వం సిద్ధం
- ఫలితాల కోసం వేచిచూడాల్సిందే...

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

కుర్చీ కోసం నువ్వా నేనా అంటూ పార్టీల అభ్యర్థులు పరుగులు పెడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం పీక్ స్టేజీకి చేరింది. మరో మూడురోజుల్లో పార్టీల ప్రచారమూ ముగియనుంది. ఈ నెల 13న పోలింగ్ జరిగితే, ఫలితాలు జూన్ 4వ తేదీ వెల్లడవుతాయి. అంటే పోలింగ్ అయ్యాక, ఫలితాల కోసం 21 రోజుల పాటు సస్పెన్స్‌ను భరించాల్సిందే. రాష్ట్రంలో ప్రధాన రాజకీయపార్టీలు కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి మొత్తం 17 లోక్‌సభ స్థానాల్లో తమ అభ్యర్థుల్ని పోటీకి నిలిపాయి. సిపిఎం భువనగిరి లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తుంది. అలాగే మజ్లిస్ పార్టీ కూడా కేవలం హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి మాత్రమే పోటీచేస్తుంది. సిపిఐ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించింది. సిపిఎం కూడా భువనగిరి మినహా మిగిలిన 16 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించింది. 2019 ఎన్నికల్లో నాలుగు పార్లమెంటు స్థానాలు గెలిచిన బిజెపి ఈసారి ఆ సంఖ్యను పెంచుకోవాలని తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అయితే రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో బిజెపి ఇప్పుడున్న స్థానాలను నిలుపుకోవడం కూడా కష్టంగా మారినట్టు తెలుస్తుంది. పార్లమెంటు ఎన్నికలు పూర్తిగా ముక్కోణపోటీలో జరుగుతున్నాయి. మెజారిటీ సీట్ల సాధనపై కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ ధీమా వ్యక్తంచేస్తున్నాయి. పిసిసి అధ్యక్షులు, ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్ని నియోజకవర్గాల్లోనూ సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. పలుచోట్ల అభ్యర్థుల గెలుపును ఆయా ఉమ్మడి జిల్లాల మంత్రులకు అప్పగించారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్, ఆయన కుమారుడు, మాజీ మంత్రి కెటిఆర్ కూడా అన్ని లోక్‌సభ స్థానాలను చుట్టివస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎన్నికల ప్రచారంపై 48 గంటల నిషేధం విధించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక బిజెపి ఎన్నికల ప్రచారం పూర్తిగా ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఆపార్టీ జాతీయ అధ్యక్షులు జెపి నడ్డాల పర్యవేక్షణలో జరుగుతోంది. ఈ ఎన్నికల్లో బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు కె లక్ష్మణ్ దాదాపు ప్రచారానికి దూరంగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తుంది. అడపాదడపా హైదరాబాద్ లోక్‌సభ పరిధిలో మాత్రమే ఆయన తూతూ మంత్రంగా తిరుగుతున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి పోటీ చేస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోకే గతంలో లక్ష్మణ్ ప్రాతినిధ్యం వహించిన ముషీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ఉంది. కనీసం అక్కడ కూడా కిషన్‌రెడ్డి కోసం ప్రచారం చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర బిజెపి నేతల మధ్య ఆధిపత్య పోరు ఈ ఎన్నికల్లో వెల్లడవుతున్నదని ఆ పార్టీ శ్రేణులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ 12 నుంచి 14 ఎంపి స్థానాల్లో విజయం సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. బిజెపి కూడా అదే లక్ష్యాన్ని పైకి ప్రకటించినా, ఆ పార్టీకి క్షేత్రస్థాయిలో నాయకత్వం, కార్య కర్తలు లేకపోవడంతో అవరోధంగా మారింది. ఇక బిఆర్ఎస్ కూడా ఇదే లక్ష్యాన్ని పెట్టుకొని ప్రచారం చేస్తుంది. అయితే త్రిముఖ పోటీలో బిఆర్ఎస్ మూడోస్థానానికి పడిపోయి, బిజెపికి మేలు జరుగుతుందనే రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 11వ తేదీతో ఎన్నికల ప్రచారం ముగియనుంది. మూడు ప్రధాన పార్టీలు ఈలోపు ఓటర్లను ఆకట్టుకొనేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. అయితే పోలింగ్‌కు ముందు రోజైన 12వ తేదీ కీలకంగా మారనుంది. ఆరోజే ఓటర్లను ప్రలోభపెట్టేందుకు రాజకీయ పార్టీలు అందివచ్చిన అవకాశాలన్నింటినీ వాడుకోవాలని భావిస్తున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కేంద్ర ఎన్నికల సంఘం (ఇసి) స్వాధీనం చేసుకున్న సొమ్ము, ఉచితాలు, తాయిలాలతో పోలిస్తే, లోక్‌సభ ఎన్నికల్లో ఇవి చాలా తక్కువగా ఉన్నాయి. వాటిలో కూడా ఎన్నికలతో సంబంధం లేని సాధారణ ప్రజల నుంచి తనిఖీల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న సొమ్ము, ఆభరణాలే ఎక్కువగా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఓటర్లకు పంచేందుకు అవసరమైన సొమ్మును ప్రధాన రాజకీయ పార్టీలు ముందుగానే బూత్ స్థాయిలో ఆయా బస్తీల్లోకి చేర్చేశాయనే ప్రచారం జరుగుతుంది. ఇవన్నీ ఈనెల 11వ తేదీ రాత్రి నుంచి ఓటర్లకు చేరే అవకాశాలు ఉన్నాయి. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం మరింత పటిష్టమైన నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది. మరోవైపు 13వ తేదీ జరిగే పోలింగ్‌కు ఇసి అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసింది. కేంద్ర బలగాల పహారాల్లో ఎన్నికల ఫెలిసిటేషన్ సెంటర్లు ఉన్నాయి. ఇవిఎంల తనిఖీలు పూర్తయ్యాయి. ఈ నెల 11వ తేదీ ఆయా రాజకీయపార్టీల ఏజెంట్ల సమక్షంలో మరోసారి ఈవీఎంలను పరిశీలించనున్నారు. రసవత్తరంగా సాగుతున్న ఈ పోరులో ఓటరు తీర్పు ఎలా ఉంటుందో వేచిచూడాల్సిందే!

బిఆర్ఎస్ నేత క్రిశాంక్ అరెస్టు అప్రజాస్వామికం

- కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నేత క్రిశాంక్ అరెస్టు అప్రజాస్వామికమని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ అన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం మెస్‌ల మూసివేతపై దుష్ప్రచారం చేసిన కేసులో చంచల్‌గూడ జైలులో ఉన్న క్రిశాంక్‌ను ఆయన కలిశారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ క్రిశాంక్ చేసింది తప్పయితే తాను జైలుకు వెళ్తానన్నారు. సిఎం రేవంత్‌కు దమ్ముంటే ఆయన పెట్టిన సర్క్యులర్, తమ పార్టీ నేత పెట్టిన సర్క్యులర్ నిపుణుల ముందు పెట్టాలన్నారు. తప్పు చేసిన వారిని జైల్లో పెట్టాలని కెటిఆర్ డిమాండ్ చేశారు.

తన భర్తపై తప్పుడు కేసు పెట్టారని క్రిశాంక్ భార్య సుహాసిని ఆరోపించారు. ఇలాంటి కేసులు ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఒయు మెస్‌ల మూసివేతపై సర్క్యులర్‌ను మార్ఫింగ్ చేశారన్న అభియోగంపై ఈ నెల ఒకటిన క్రిశాంక్‌ను అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రేమేందర్‌రెడ్డి

- ప్రకాశ్‌రెడ్డి, కాసంకు నిరాశే

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ స్థానం నుంచి బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్‌రెడ్డి పోటీ చేయనున్నారు. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ జాతీయ నాయకత్వం ప్రకటించింది. ఆయన గురువారం నల్లగొండలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్లకు దాఖలుకు గురువారమే చివరి రోజు. వాస్తవానికి ఈ అభ్యర్థిత్వం కోసం బిజెపి సీనియర్ నేత, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు తుది వరకు ప్రయత్నించినప్పటికీ నిరాశే మిగిలింది. వీరిద్దరూ కిషన్‌రెడ్డికి అత్యంత సన్నిహితులనే ముద్ర ఉంది. వారిద్దరి కంటే ఆర్థిక వనరులు ప్రేమేందర్‌రెడ్డి వద్ద ఎక్కువగా ఉండటం వల్లనే జాతీయ నాయకత్వం ఆయన వైపు మొగ్గు చూపినట్టు ప్రచారం జరుగుతున్నది.

తమిళిసైపై చర్యలు తీసుకోండి

- ఎన్నికల సంఘానికి బిఆర్ఎస్ ఫిర్యాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మాజీ గవర్నర్, బిజెపి నేత తమిళిసై సౌందర రాజన్‌పై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీనివాస్ రెడ్డి బుధవారం కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. లోకసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో రామమందిర ప్రతిమలను ఆమె ఓటర్లకు పంచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందువల్ల ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా వ్యవహరించిన తమిళిసైపై లోకసభ ఎన్నికల్లో ప్రచారం నిర్వహించకుండా నిషేధం విధించాలని విజ్ఞప్తి చేశారు.

క్రెడాయ్ కార్మిక వారోత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

దేశంలోని ప్రయివేటు రియల్ ఎస్టేట్ డెవలపర్ల సంస్థ అయిన క్రెడాయ్ హైదరాబాద్ 'కార్మిక వారోత్సవాలు' జరుపుకుంటున్నట్లు ప్రకటించింది. క్రెడాయ్ కేర్స్ కార్యక్రమంలో భాగంగా వారు నగరంలోని మెంబర్ డెవలపర్ సైట్‌లో కార్మికుల పిల్లల కోసం 'క్రెచ్' విరాళం ఇచ్చారు. అలాగే, సైట్‌లోని కార్మికుల ఆరోగ్యాన్ని పరీక్షించడానికి అనంత రిహాబ్‌తో కలిసి హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ హైదరాబాద్ ప్రెసిడెంట్ వి రాజశేఖర్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎలెక్ట్ జైదీప్ రెడ్డి, జనరల్ సెక్రటరీ బి జగన్నాథరావుతో పాటుగా మేనేజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తల్లిదండ్రులు సైట్‌లో పని చేస్తున్నప్పుడు వారి పిల్లల భద్రతను నిర్ధారించడానికి తాము క్రెడాయ్ క్రెచ్‌ను స్పాన్సర్ చేస్తున్నామని రాజశేఖర్ రెడ్డి తెలిపారు.

బిజెపిని ఓడించడం కార్మికవర్గ తక్షణ కర్తవ్యం

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు

సదస్సులో మాట్లాడుతున్న చుక్కా రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల్లో బిజెపిని ఓడించడం కార్మికవర్గ తక్షణ కర్తవ్యమని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని చర్లపల్లిలో చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల ముగింపు సందర్భంగా 'పార్లమెంట్ ఎన్నికలు- కార్మికవర్గ కర్తవ్యం' అనే అంశంపై బుధవారం సాయంత్రం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. 138 సంవత్సరాల కిందట కార్మికుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న పని గంటల దినం మేడే అన్నారు. 1991 తర్వాత పీవీ నరసింహారావు ప్రభుత్వం నూతన సరళీకరణ ఆర్థిక విధానాలు ప్రవేశపెట్టి పెట్టుబడిదారీ వర్గానికి లాభాలు చేకూర్చేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు. ప్రస్తుతం రెండోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు లాభాలు చేకూర్చడానికి 44 కార్మిక చట్టాలను కుదించి నాలుగు కోడ్‌లుగా మార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కార్మికుల ఉద్యోగ భద్రత, హక్కులు ప్రమాదంలో పడ్డాయన్నారు. అలాగే యూనియన్లు లేకుండా చేసి కార్మికులను దోచుకునే ప్రయత్నం జరుగుతోందన్నారు. నాలుగు లేబర్ కోడ్లను అనేక రకాలుగా మార్పులు చేసేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. ఈసారి మళ్లీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాటిని అమలు చేస్తుందని, అందుకే అందుకే కార్మికవర్గం ఆలోచించి కార్మిక వ్యతిరేకి బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్మికులకు, యువకులకు, రైతులకు, అందరికీ ద్రోహం చేసిన పార్టీని ఓడించాలన్నారు. మే డే సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజయం సాధించిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చిన్మయాస్ చైర్మెన్ రోషిరెడ్డి, సిఐటియు మేడ్చల్ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బివి సత్యనారాయణ, జి శ్రీనివాసులు, కోశాధికారి ఎం శ్రీనివాసరావు, నాయకులు జె వెంకటేష్, పి శ్రీనివాస్, టి నరసింహ, ఆదాం, పాషా, సంతోష్, గణేష్, ఆర్ శ్రీనివాస్, ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేస్తున్న జస్టిస్ ఈశ్వరయ్య

బిసిలకు అన్యాయం చేసిన బిజెపిని గద్దె దించాలి

- ఇండియా కూటమిని గెలిపించాలి : జస్టిస్ ఈశ్వరయ్య
- బిసిలకు జరిగిన అన్యాయంపై కరపత్రం విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో 70 కోట్ల మంది బిసిలకు తీవ్ర అన్యాయం చేసిన బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని అఖిల భారత బిసి ఫెడరేషన్ అధ్యక్షులు జస్టిస్ ఈశ్వరయ్య అన్నారు. బిసి వెల్ఫేర్ అసోసియేషన్, అఖిల భారత జాతీయ బిసి ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం బిసిలకు బిజెపి చేసిన అన్యాయంపై, బిసిలు ఇండియా కూటమిని ఎందుకు బలపర్చాలో వివరిస్తూ హైదరాబాద్ లక్డికాపూల్‌లోని సెంట్రల్ కోర్ట్ హోటల్‌లో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల్ కమిషన్ రిపోర్టును నిర్వీర్యం చేసింది బిజెపి అని విమర్శించారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో కుల గణనకు మొదటి ప్రాధాన్యత ఇచ్చింది కాబట్టి బిసిలందరూ ఇండియా కూటమికి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

బిసి సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పది సంవత్సరాల పాలనలో బిసిలను బిజెపి నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ బిసి అయినప్పటికీ ఆ తరగతికి ఆయన చేసిందేమీ లేదన్నారు. బిసి సంక్షేమం కోసం ఒక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేదన్నారు. దేశవ్యాప్తంగా కుల గణన చేసే ప్రసక్తే లేదని సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిన పార్టీ బిజెపి అని తెలిపారు. ఇండియా కూటమి తన మ్యానిఫెస్టోలో ప్రథమ ఎజెండాగా దేశవ్యాప్తంగా కుల గణన చేస్తామని పేర్కొందని, దీనిని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి చైర్మన్ శ్రీశైలం యాదవ్, బిసి సంఘం రాష్ట్ర అధ్యక్షులు విజయ భాస్కర్, బిసి విద్యార్థి సంఘం సెంట్రల్ కమిటీ అధ్యక్షులు విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపిలో చేరగానే పునీతులవుతారా?

రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ప్రధాని మోడీ వేములవాడ రాజన్న సాక్షిగా.. పచ్చిమాంసం తినే పులి స్తోత్రాలు వల్లించినట్టుగా కాంగ్రెస్‌పై అబద్ధాల విమర్శలు చేసి జారుకున్నారే తప్ప.. ఇక్కడి ప్రజల కోసం ఒక్క హామీ ఇవ్వలేదు.. కనీసం అభివృద్ధి సోయి లేని బిజెపి అభ్యర్థి కూడా మోడీ భజనతోనే సరిపెట్టుకున్నారు. వేములవాడలో బుధవారం కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో మోడీపైనా, బండి సంజయ్‌పైనా మంత్రి పొన్నం విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు మన విద్యుత్ కేపాసిటీ కేవలం 1300 మేగావాట్లని, దాన్ని 4 లక్షల మెగావాట్లకు పెంచింది కాంగ్రెస్ పార్టీనేనని తెలిపారు. అవినితికి మారు పేరుగా ఉన్న బిజెపి.. ఈడీ, సిబిఐ విచారణ జరుగుతున్న నేతలు తమ పార్టీలో చేరగానే పునీతులను చేస్తున్నారని విమర్శించారు. ఆదర్శ స్కాం ఆద్యుడు అశోక్ చవాన్‌కు రాజ్యసభ సీటు, కోల్ స్కాం కింగ్ పిన్ మధు కోడాకు, రూ.70 వేల కోట్ల ఇరిగేషన్ స్కాంలో ఉన్న అజీత్ పవార్ సతీమణికి, ఢిల్లీ లిక్కర్ కేసు అప్రూవర్ మాగుంట శ్రీనివాస్ రెడ్డికి లోక్‌సభ సీటు ఇచ్చింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఆంధ్రా మాల్యాలుగా పేరున్న సిఎం రమేష్‌కు ఎంపీ టికెట్, సుజనా చౌదరికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారని, ఇలా చెప్పుకుంటూ పోతే దేశంలోని అవినీతిపరులంతా బిజెపిలో చేరగానే కేసులు ఎత్తివేసిన చరిత్ర ప్రధాని మోడీదని అన్నారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దు చేశామన్న మోడీ అక్కడ శాంతి నెలకొందా? అనేది చెప్పాలని, నిజంగా అక్కడ శాంతి నెలకొంటే బిజెపి ఎందుకు ఎన్నికల్లో పోటీ చేయలేదని ప్రశ్నించారు. కశ్మీర్‌లో మూడు లోక్‌సభ సీట్లు ఉంటే.. ఒక్క సీటులోనూ అభ్యర్థిని పోటీలో పెట్టకుండా పారిపోయింది వాస్తవం కాదా? అని నిలదీశారు. రాజకీయాల కోసం రక్షణ బలగాలను వాడుకున్న ద్రోహ చరిత్ర మీదంటూ విమర్శించారు.

రేవంత్‌రెడ్డిది బాధ్యతారహిత ఆరోపణ

- కేంద్ర మంత్రి జి కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎంగా ఉండి రేవంత్‌రెడ్డి రిజర్వేషన్లపై బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర కార్యదర్శి జి కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇది శాంతిభద్రతలకు సంబంధించిన అంశమన్నారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు గురువారం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోడీ, 11న రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాష్ట్రానికి రాబోతున్నారని చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్లపై బిజెపిని టార్గెట్ చేసి ఇరకాటంలో పెట్టే కుట్రను కాంగ్రెస్ చేసిందన్నారు. ఆ పార్టీ ఫెయిల్యూర్‌ను తమ మీద మోపాలని చూసిందని విమర్శించారు. రిజర్వేషన్ల సమస్యను ప్రజలెవ్వరూ సీరియస్‌గా తీసుకోవడం లేదన్నారు. బిజెపి అభ్యర్థులకు పెరుగుతున్న ఆదరణను చూసి రేవంత్‌రెడ్డిలో కలవరం మొదలైందని చెప్పారు. ముగ్గురు జర్నలిస్టులను జైలులో వేస్తే సర్దుకుంటుందని సిఎం అహంకారంతో మాట్లాడటాన్ని తప్పు బట్టారు. ఆయన ఒక రీసెర్చ్ టీమ్‌ను పెట్టుకున్నారనీ, ఆ టీమ్ అందించే కొత్తకొత్త తిట్లను ప్రయోగిస్తున్నారని విమర్శించారు. కెసిఆర్ అనే నిజాం పోయి కొత్త నిజాంగా తానొచ్చినట్టు రేవంత్‌రెడ్డి ఫీలవుతున్నారని ఎద్దేవ చేశారు.

40 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి

- పిఆర్‌సి చైర్మన్‌కు టిఆర్‌టిఎఫ్ ప్రతిపాదనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారులకు వేతన సవరణ ప్రతిపాదనల పత్రాన్ని అందిస్తున్న టిఆర్‌టిఎఫ్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 40 శాతం ఫిట్‌మెంట్‌తో రెండో పిఆర్‌సి ఇవ్వాలని టిఆర్‌టిఎఫ్ కోరింది. ఈ మేరకు పిఆర్‌సి చైర్మన్ ఎన్ శివశంకర్, సభ్యులు బి రామయ్యకు మంగళవారం హైదరాబాద్‌లో వేతన సవరణ ప్రతిపాదనలను ఆ సంఘం గౌరవాధ్యక్షులు మానేటి ప్రతాపరెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, చీఫ్ ప్యాటర్న్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి నేతృత్వంలో సమర్పించారు. 2022-23 జాతీయ వార్షిక ద్రవ్యోల్బణ రేటు 6.8 శాతం, తెలంగాణలో 8.7 శాతం ఉందని తెలిపారు. ఈ కారణంగా వస్తువు సేవల ధరలు ఊహించనంతగా పెరిగాయని పేర్కొన్నారు. కొనుగోలు శక్తి తగ్గి ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిజవేతనాలు పడిపోతున్నాయని వివరించారు. సీపీఎస్ రద్దుకు పీఆర్సీ కమిటీ సిఫారసు చేయాలని కోరారు. సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్ల మధ్య ఉన్న భారీ వ్యత్యాసాన్ని తగ్గించాలని సూచించారు. రిటైర్మెంట్ గ్రాట్యుటీ రూ.28 లక్షలుండాలని తెలిపారు. అప్రయత్న పదోన్నతి 5/10/15/20/25 ఏండ్లుగా మార్చాలని పేర్కొన్నారు. హెచ్ఆర్ఏ పాత పద్ధతిని పునరుద్ధరించి మారుమూల ప్రాంతాల్లో ఉన్న నాలుగో తరగతి ఉద్యోగులకు ప్రత్యేక అలవెన్సు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీఆర్టీఎఫ్ నాయకులు సుంకిశీల ప్రభాకర్‌రావు, మారెడ్డి అంజిరెడ్డి తున్నూరి సురేష్, షద్రక్, కుషాల్, ప్రణీత్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఆప్తుడు కళా సుబ్బారావు

- ఆచార్య కొలకలూరి ఇనాక్

ప్రజాశక్తి కల్చరల్

కళా సుబ్బారావు ఎందరో ఔత్సాహికుల కళాకారులకు త్యాగరాయ గానసభ వేదిక అందించి, ప్రోత్సహించిన సాంస్కృతిక రంగ ఆప్తుడని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ కొనియాడారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా సుబ్బారావు కళా వేదికపై గానసభ నిర్వహణలో గానసభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఆచార్య ఇనాక్ పాల్గొని రంగస్థల ప్రముఖులు తుర్లపాటి రామచంద్రరావుకు కళా సుబ్బారావు స్మారక నాటక పురస్కారం బహుకరించి మాట్లాడారు. సుబ్బా రావు గానసభ వ్యవస్థీకరణలో ప్రధాన పాత్ర పోషించి సుదీర్ఘ కాలం అధ్యక్షునిగా వివిధ కళా ప్రక్రియల కళాకారులకు తనవంతు సహకారం అందించారని అన్నారు. అయన సామాజిక కార్యకర్తగా వ్యాపారవేత్త గానూ జంట నగరాల్లో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారని వివరించారు. సన్మానం స్వీకరించిన తుర్లపాటి రామచంద్రరావు మాట్లాడుతూ నాటక రంగలో తన విశేష కృషికి కళా సుబ్బారావు అందించిన సహకారం విస్మరించలేనిది అన్నారు. ఆయనకు పౌరాణిక నాటకం హరి కథ శాస్త్రీయ సంగీతం అంటే మక్కువ ఎక్కువ అని చెప్పారు. కళా సుబ్బారావు సహచరులతో కలసి నాటిన మొక్క గాన సభ నేడు వారి కుమారులు నిర్వహణలో సమున్నత స్థానం సంపాదించుకున్నదని ప్రశంసించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమ తండ్రి సుబ్బరావు పేరును పాడు చేయకుండా గానసభ వైభవాన్ని కొనసాగిస్తున్నమని తెలిపారు. పురస్కార గ్రహీత రామచంద్రరావుకు సుబ్బారావుకు వున్న సన్నిహిత సంబంధం గుర్తు చేశారు వేదికపై సినీ నిర్మాత రామ సత్యనారాయణ, సమాజిక సేవకులు పిఎస్ఆర్ మూర్తి కళా పోషకుడు గుదిబండి వెంకట రెడ్డి తదితరులు పాల్గొని సుబ్బారావు సేవలు విశ్లేషించారు

బండి సంజయ్‌ది మోడీ భజనే

- కరీంనగర్‌కు ఏం కావాలో అడగలేదు : బిఆర్ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వినోద్‌కుమార్

వేములవాడ బిజెపి ఎన్నికల ప్రచార సభలో ఆ పార్టీ అభ్యర్థి బండి సంజయ్ ప్రధాని మోడీ జపం చేస్తూ భజన చేశారే తప్ప.. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి, రాష్ట్రానికి ఏం కావాలో అడగలేకపోయారు. ఇప్పుడు ఆయన గెలుపు కోసం వచ్చిన మోడీ సైతం వారణాసికి రూ.వందకోట్లు ఇచ్చినట్టుగా.. దక్షిణకాశీగా పేరుగాంచిన వేముల వాడకు నయాపైసా ప్రకటించలేదు' అని బిఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విమర్శించారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెయ్యేండ్ల చరిత్ర ఉన్న వేములవాడ ఆలయానికి ఏవైనా అభివృద్ధి నిధులు ఇస్తారని తాను ఆశించానని, కనీసం ఆలయ ప్రతిష్ట గురించి ప్రస్తావించకుండా వెళ్లిపోవడం దురదృష్టకరమని అన్నారు. దేవుడి పేరుతో రాజకీయం చేసే బండి సంజయ్.. వేములవాడ గుడి కోసం నిధులు ఇవ్వమని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే వేములవాడ ఆలయ అభివృద్ధి జరిగిందని, పక్కనే ఉన్న 32 ఎకరాల గుడి చెరువును పునరుద్ధరించి ఎంతో అభివృద్ధి చేశామని చెప్పారు. తాను ఎంపిగా ఉన్న సమయంలో కేంద్రం ప్రసాద్ స్కీమ్‌ను తీసుకొస్తే ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, కొండగట్టు, ధర్మపురి, కాళేశ్వరం ఆలయాలకు ఒక సర్క్యూట్ జారీ చేయాలని కొట్లాడానని తెలిపారు. ఇక్కడకు ప్రధాని వచ్చినా ఒక్క హామీ దక్కలేదని, రాష్ట్రానికి నవోదయ విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్టుల జాతీయ హోదా, ఇలా ఒక్క జాతీయ ప్రాజెక్టునూ అడగలేకపోయిన సంజయ్‌ని ప్రజలు ఎందుకు గెలిపించాలని ప్రశ్నించారు. మరోవైపు దేశంలో బిజెపి సర్కారు రాదనే అసహనం ప్రధాని మొహంలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. దేశంలో ఎస్సి, ఎస్టిల రిజర్వేషన్లు గుంజుకునే హక్కు ఎవరికీ లేదని, వీటిపై కాంగ్రెస్, బిజెపి ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయని అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు ఎల్ రమణ, భానుప్రసాద్‌రావు, మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవిందర్ సింగ్ ఉన్నారు.

ప్రాణం పోయినా సిద్దిపేట జిల్లాను రద్దు కానివ్వను

- కుదేలవుతున్న రియల్ ఎస్టేట్ రంగం : హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



సమావేశాలో మాట్లాడుతున్న హరీశ్ రావు

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పాలన రివర్స్ గేర్‌లో నడుస్తోందని, జిల్లాలను రద్దు చేస్తామంటున్నారని, ప్రాణం పోయినా సరే సిద్దిపేట జిల్లాను రద్దు కానివ్వబోనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలోని శివానుభవ మండపంలో బిఆర్ఎస్‌కు మద్దతుగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అనంతరం ఆర్ఎంపి, పిఎంపిలు బుధవారం నిర్వహించిన సమావేశాల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే, హరీశ్ రావు పాల్గొని మాట్లాడారు. అద్భుతమైన రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతుందని అన్నారు. రాష్ట్రంలో మార్పు వస్తుందని చెబుతున్నారని, కానీ కరెంట్ విషయంలో, కల్యాణ లక్ష్మి, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మార్పు వచ్చిందని ఆరోపించారు. కరోనా సమయంలోనూ కెసిఆర్ రైతుబంధు ఇచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇంకా రైతుబంధు రాలేదని, ఇదేనా మార్పు అని ప్రశ్నించారు. రిజర్వేషన్లు, మతం పేరిట బిజెపి, కాంగ్రెస్ పార్టీలు దొంగ నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. నేడు టివి చూస్తే తిట్లు, దేవుడు మీద ఒట్లు కనబడుతున్నాయన్నారు. ఆరు గ్యారంటీలను ఎగబెట్టాలనే డ్రామాతో రాష్ట్రం దివాళా తీసిందని చెప్పడంతో పెట్టుబడులు రావడం లేదని, అందుకే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందన్నారు. అలాగే, రాష్ట్రంలో మొదటి ఆర్ఎంపి, పిఎంపి భవనం సిద్దిపేటలో నిర్మాణం చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.150 కోట్ల పనులు ఆపారని, వెటర్నరీ కళాశాల తరలించారని తెలిపారు. బిజెపి అభ్యర్థి దుబ్బాకలో ఏమీ చేయలేదన్నారు. సిద్దిపేట అభివృద్ధి చూసి కాంగ్రెస్, బిజెపి ఓర్వలేదన్నారు. ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. వెంకట్రామిరెడ్డి గెలుపు హరీశ్‌రావు గెలుపని, సిద్దిపేట అభివృద్ధి కోసం వెంకట్రామిరెడ్డి నిత్యం పని చేస్తాడన్నారు. తన ఊపిరి ఉన్నంత వరకు సిద్దిపేట కోసం పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఫారుక్ హుస్సేన్, రవీందర్ రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, రాజలింగం, దరిపల్లి శ్రీను, రమేష్, ఆర్ఎంపిల సంఘం నాయకులు ముదిగొండ శ్రీనివాస్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.